క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా సూరిబాబు



చిలుకూరు: ఎమ్మార్పీఎస్ మండల కార్యవర్గాన్ని ఆదివారం చిలుకూరులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వరుసగా రెండో సారి సంఘం మండల అధ్యక్షుడిగా చిలుకూరు గ్రామానికి చెందిన మల్లెపంగు సూరిబాబు మాదిగను ఎన్నుకున్నారు. మండల అధికార ప్రతినిధిగా మేముల భార్గవ్, ఉపాధ్యక్షుడిగా వేములు అశోక్, కార్యదర్శిగా కందుకూరి రామారావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వడ్డెపల్లి కోటేష్, నాయకులు కందుకూరి సోమన్న, బోడ సునీల్, కందుకూరి లచ్చయ్య, సిద్దెల పిచ్చయ్య, గురవయ్య, మహేష్, అంజి, సిద్ధూ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన



బూరుగడ్డలో స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, దాతలు

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని బూరుగడ్డలోని నల్ల చెరువుకట్ట పక్కన 20అడుగుల ఎత్తుగల భారీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఆదివారం దాతలు, ప్రజాప్రతినిధులు స్థల పరిశీలన చేశారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మంత్రి ప్రగడ గిరిజాకుమారి రూ.1,05,116లు, మాజీ ఎంపీపీ గూడెపుశ్రీనువాస్ రూ.1,00,116లు, హైదరాబాద్‌కు చెందిన తుమ్మగోటి పద్మజ రూ.1,00,116లు విరాళాలుగా ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్‌దేశ్‌ముఖ్, వీరబాబుగౌడ్ పాల్గొన్నారు.

రహదారుల వెంట వాహనాలు నిలపొద్దు

నడిగూడెం : రహదారుల వెంట వాహనాలు నిలపొద్దని ఎస్ఐ జి.అజయ్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొద్ది రోజులుగా నడిగూడెం మండల కేంద్రంలో వాహనాలు అడ్డుగా నిలిపడం పట్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా వరి కోత యంత్రాలు రహదారుల వెంట నిలపవద్దన్నారు.

నిమిషం నిబంధన ఎత్తివేయాలి

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వం నిర్వహించే అన్ని పరీక్షలకు నిమిషం నిబంధన ఎత్తివేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిమిషం ఆలస్యం నిబంధనను అధికారులు అమలు చేయడం వలన విద్యార్థుల బంగారు భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. గ్రూప్–3 పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యం కావడం చాలా మంది అభ్యర్థులు పరీక్షలను రాయలేక పోయారన్నారు. దేశంలోని అత్యున్నతమైన ఏపీపీఎస్సీ పరీక్షలకు ఇలాంటి నిబంధనలు లేవని, అందుకు భిన్నంగా రాష్ట్రంలో రాసే వివిధ పరీక్షలకు ఈ నిబంధనలు పెట్టుతున్నారన్నారు. ఈ నిబంధనను తక్షణమే ఎత్తివేయాలని కోరారు.

హామీలు అమలు చేయాలి

నాగారం : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కడియం కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పింఛన్లు పెంచుతామని, మహిళలకు రూ.2500 ఇస్తామని, రైతుభరోసా ఇస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. కానీ నేడు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో విఫలమైందని తెలిపారు. ఆయనతో పాటు సీపీఎం నాయకులు మారయ్య, మల్లయ్య, వెంకన్న, సైదమ్మ, పద్మ, భిక్షం, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

సెలవు రోజులోనూ కొనసాగిన ఇంటింటి సర్వే

అర్వపల్లి : సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే ఆదివారం కూడా కొనసాగింది. సర్వే సమయంలో ఇళ్లలో కొంతమంది ప్రజలు అందుబాటులో ఉండకపోవడంతో ఎన్యుమరేటర్లు ఇబ్బంది పడుతున్నారు. ఒక్కో ఇంటికి రెండు మూడు సార్లు తిరగాల్సి వస్తుందని ఎన్యుమరేటర్లు చెబుతున్నారు. మండల వ్యాప్తంగా 81 మంది ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్నారు. ప్రజలు అందుబాటులో ఉండి పూర్తి వివరాలను అందించాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు కోరారు.



అర్వపల్లిలో సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్

సైబర్ నేరాలపై పోలీసుల దృష్టి

- నేరాలపై కళాజాతా బృందాలతో ప్రజలకు అవగాహన
- ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరమని సూచనలు
- ఓటీపీలు ఇతరులకు చెప్పొద్దంటున్న పోలీసులు



అవగాహన కల్పిస్తున్న సీఐ చరమందరాజు

పాలకవీడు: ఇటీవల సైబర్ నేరాలు విపరీతంగా పెరిగాయి. టెక్నాలజీని వినియోగించుకుని ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు. దీంతో పోలీసులు సైబర్ నేరాలపై దృష్టిసారించారు. ప్రజలు వారి ఉచ్చులో పడకుండా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. సెల్‌ఫోన్, వాట్సాప్, ఫేస్‌బుక్ ఇలా సోషల్ మీడియాలో వచ్చే అనవసరమైన లింకులపై క్లిక్ చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నారు. అపరిచిత వ్యక్తులతో వాట్సాప్ చాటింగ్, కాల్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

హలో బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం

సైబర్ నేరగాళ్లు ప్రజలను సులువుగా దోచేస్తున్నారు. ఎప్పటికప్పుడు కొత్త పంథాలో బురిడీ కొట్టిస్తున్నారు. నిరక్షరాస్యుల నుంచి విద్యావంతుల వరకు ఇలా అందరి దగ్గర నుంచి అందినకాడికి డబ్బు లాగేస్తున్నారు. మేము బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం మీ ఆధార్ నంబరు చెప్పండి, మీ సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పండి, మీ ఏటీఎం కార్డు వివరాలు నమోదు చేసి ఓకే చేయండి అంటూ వివిధ రకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగిస్తున్నారు.

1930 టోల్ ఫ్రీ నంబర్..

ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలే కాకుండా ట్రాఫిక్ నియమాలు, వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హుజూర్‌నగర్ సర్కిల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో కళా బృందాలతో కలిసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగానే పాలకవీడు మండలంలో సీఐ చరమందరాజు ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్మెట్ లేని ప్రయాణం కలిగే ప్రమాదాలు, రాంగ్‌రూట్ డ్రైవింగ్, జిగ్‌జాగ్ డ్రైవింగ్, మితిమీరిన వేగం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనం నడిపినా, మైనర్ల చేతికి వాహనాలు ఇచ్చినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు వెంటనే 1930 నంబరుకు కాల్ చేసి ఎన్‌సీఆర్‌పీలో వివరాలు నమోదు చేస్తే 24 గంటల్లో డబ్బు వాపస్ వచ్చే అవకాశం ఉందని పోలీసులు పేర్కొంటున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

సైబర్ నేరగాళ్ల చేతిలో ఎవరూ మోసపోకుండా అవగాహన కల్పిస్తున్నాం, బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నాం. మొబైల్‌కు వచ్చిన ఓటీపీ చెప్పాలంటూ కాల్స్ వస్తే లాంటి వివరాలు చెప్పొద్దు. బ్యాంకుల నుంచి అధికారులు ఫోన్ చేయరు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలి.

– చరమందరాజు, సీఐ, హుజూర్‌నగర్

తొలిరోజు గ్రూప్–3 పరీక్షలు ప్రశాంతం



కోదాడ : అభ్యర్థులను తనిఖీ చేస్తున్న అధికారులు



మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రం వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ రాంబాబు

- ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతించని అధికారులు

కోదాడరూరల్ : గ్రూప్–3 పరీక్షలు సీసీ కెమెరాలు, పోలీసుల బందోబస్తు నడుమ ఆదివారం ప్రారంభమయ్యాయి. కోదాడలో ఏర్పాటు చేసిన 20సెంటర్లలో మొత్తం 7592 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా కేవలం 41.5 శాతం మంది మాత్రమే హాజరయ్యారు. ఉదయం పేపర్‌కు 3,024 మంది అభ్యర్థులు, మధ్యాహ్నం పేపర్‌కు 3,132 మంది హాజరయ్యారు. ఇక పట్టణ శివారులోని సనా కళాశాల సెంటర్‌లో ఉదయం ఐదుగురు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో వారిని పరీక్ష కేంద్రంలోకి అనుతించలేదు. అదే సమయంలో అక్కడ ఉన్న అడిషనల్ కలెక్టర్ రాంబాబును అభ్యర్థులు పరీక్షకు అనుమతించాలని ప్రాధేయపడినప్పటికీ నిబంధనల ప్రకారం నడుచుకోక తప్పదని ఆయన తెలపడంతో వారు వెనుదిరిగారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు.

చిలుకూరులో..

చిలుకూరు: గ్రూప్–3 పరీక్షలు ఆదివారం ప్రశాంతగా ముగిసాయి. చిలుకూరు మండలంలో మిట్స్, గేట్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రం వద్ద పోలీసులు భారీ బందోభస్తు నిర్వహించారు. విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఇచ్చారు.

అనురాగ్‌లో..

అనంతగిరి: మండల కేంద్రంలోని అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రూప్–3 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్, ఎగ్జామ్స్ చీఫ్‌సూపరింటెండెంట్ డాక్టర్ టి సురేష్ కుమార్ తెలిపారు. ఉదయం మొదటి విడతలో 840 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 348 మంది, మధ్యాహ్నం రెండవ విడతలో 350 మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు.

గ్రామాభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దాం



మాట్లాడుతున్న తూమాటి వరప్రసాద్‌రెడి

కోదాడరూరల్ : గ్రామాన్ని అభివృద్ధి చేసుకునేందుకు నాయకులందరూ కలిసికట్టుగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గుడిబండలో నిర్వహించిన ఆపార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సహకారంతో గ్రామానికి కావాల్సిన సీసీరోడ్లు, డ్రైయినేజీ, నూతన పింఛన్‌లు, ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్లస్థలాలను మంజూరు చేయించుకుందామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామశాఖ పార్టీ అధ్యక్షుడు ఎండి.రఫీ, మాజీ సర్పంచ్ ఇర్ల నర్సింహారెడ్డి, తూమాటి నాగిరెడ్డి, నరోత్తమరెడ్డి, పులి రాజారావు, ఎండి.హసన్‌అలీ, నాగరాజు, సిద్దయ్య, ప్రేమ్‌చంద్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

గరిడేపల్లి: రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చలికంటి నరేష్ హెచ్చరించారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వాహనాదారులు లారీలు, కోత మిషన్లు, ట్రాక్టర్లు, కార్లు, ద్విచక్రవాహనాలు రోడ్డుకు అడ్డగోలుగా నిలుపుతున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు వరి ధాన్యాన్ని రోడ్డుపై పోయవద్దని, నిర్లక్ష్యంగా మద్యం మత్తులో వాహనాలు నడపడం రాత్రి వేళలో ఎక్కువగా ప్రమాదాలు జగుతున్నాయన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోదాడరూరల్ : మండల పరిధిలోని నల్లబండగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో 11 కేవీ ఫీడర్‌లో ఉన్న చెట్లను తొలగించేందుకు సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ సైదా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పనుల నిమిత్తం నల్లబండగూడెం, చిమిర్యాల గ్రామాల్లో విద్యుత్ నిలిపి వేస్తున్నందున ప్రజలు సహకరించాలని కోరారు.

దొండపాడులో..

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం దొండపాడులో సోమవారం చెట్లకొమ్మలు తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం కులుగుతుందని ఏఈ వెంకటేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని 11 కేవీ లైన్ కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నడిగూడెం : నడిగూడెం 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రామాపురం ఫీడర్, కరివిరాల 11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని కాగితరామచంద్రాపురం ఫీడర్, సిరిపురం 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని వల్లాపురం ఫీడర్ లైన్ సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ కె.సైదయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించనున్నట్లు తెలిపారు.

గనుల భద్రతలో 'మైహోం'కు అవార్డులు



అవార్డు అందుకుంటున్న మైహోం పరిశ్రమ అధికారులు

మేళ్లచెరువు : గనుల భద్రత, ఉత్పత్తిలో మైహోం పరిశ్రమకు అవార్డులు వచ్చినట్లు పరిశ్రమ యూనిట్ హెడ్ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. రెండు రాష్ట్రాల స్థాయి సున్నపురాయి గనుల భద్రత వారోత్సవాలు ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి విజయవాడలో జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైహోంకు చెందిన సీ గ్రూప్ పనితీరులో వేపలమాధవరం మైన్స్‌కు ప్రథమ స్థానం, బి గ్రూప్ పనితీరులో చౌటపల్లి మైన్స్‌కు తృతీయ బహుమతి లభించినట్లు తెలిపారు. ఈ బహుమతులను భారత ప్రభుత్వ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ సేఫ్టీ, ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ చేతులమీదుగా మైన్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అప్పలరాజు, అసిస్టెంట్ మేనేజర్ నరేష్ అందుకున్నట్లు తెలిపారు.

గిరిజనులను అరెస్ట్ చేయడం సరికాదు



మాట్లాడుతున్న శ్రీనునాయక్

నేరేడుచర్ల : కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో జరిగిన ఘనటలో గిరిజనులను అరెస్ట్ చేయడం సరికాదని బీఆర్ఎస్ హుజూర్‌నగర్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు లావూడ్యా శ్రీనునాయక్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లగచర్లలో 40లక్షల రూపాయల భూమికి రూ.4లక్షలు మాత్రమే ఇస్తామని అనడంతో ప్రజలు తిరగబడ్డారని పేర్కొన్నారు.11 నెలల కాంగ్రెస్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి కుంటుపడిందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు భాణోతు సాయి, బచ్చలకూరి నాగశేఖర్, నాగుల వంచ వాసు, కొత్త నాగయ్య తదితరులున్నారు.

29న సూర్యాపేటలో సీపీఎం జిల్లా మహాసభ



హుజూర్‌నగర్: ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

హుజూర్‌నగర్ : సూర్యాపేటలో ఈనెల 29న సీపీఎం జిల్లా మహాసభ జరుగుతుందని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దుగ్గి బ్రహ్మం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శీను తెలిపారు. ఆదివారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 30 డిసెంబర్ 1 తేదీల్లో ప్రతినిధుల మహాసభలు జరుగుతాయని తెలిపారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వేణు, శ్రీను, అన్నపూర్ణ, సైదులు, రాము, రేణుక, కల్పన, నాగమణి, వెంకటయ్య, సావిత్రి, ప్రేమ్, కోటయ్య, కార్తీక్. వీరయ్య పాల్గొన్నారు.

ఫార్మా విజన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా శివ



మిర్యాలగూడ టౌన్ : ఫార్మా విజన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా మిర్యాలగూడ పట్టణానికి చెందిన గొట్టిపర్తి శివను నియమిస్తూ ఏబీవీపీ జిల్లా విభాగ్ ప్రముఖ్ కత్తుల ప్రమోద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 15, 16వ తేదీల్లో సూర్యాపేటలోని వికాస్ ఫార్మసీ కళాశాలలో ఏబీవీపీ విద్యార్థులకు నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు సభలో ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా గొట్టిపర్తి శివ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఫార్మసీ కళాశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఫార్మా విజన్ కన్వీనర్‌గా నియమించడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు.

మాదిగలను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి



నియామక పత్రాలు అందజేస్తున్న నాయకులు

కోదాడరూరల్ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలను మోసం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా కో ఆర్డినేటర్లు బోడ సునీల్ మాదిగ, కందుకూరి సోమన్న మాదిగ అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన కోదాడ మండల ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీల నూతన కమిటీ ఎన్నిక సమావేశంలో వారు మాట్లాడారు. ఆగస్టు 1న ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిన సమయంలో తెలంగాణలోనే మొదటగా అమలు చేస్తామన్న సీఎం మాట నిలుపుకోలేదన్నారు. అనంతరం మండల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా పిడమర్తి చిన్న వెంకట్రావ్ మాదిగ, అధికార ప్రతినిధిగా దుద్దెల గోపికృష్ణమాదిగ, ఉపాధ్యక్షుడిగా చెరుకుపల్లి వెంకటరత్నం, ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా ఒగ్గు ఓసోబు మాదిగ, అధికారప్రతినిధిగా కలకొండ గురుప్రసాద్, ఉపాధ్యక్షుడిగా పిడమర్తి బ్రహ్మం మాదిలతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు ఏపూరి రాజుమాదిగ, పాముల శ్రావణ్, విక్రం, యాకోబు, ఉపేందర్, లక్ష్మయ్య ఉన్నారు.

అయ్యప్ప సన్నిధానంలో అన్నదానం

మునగాల: మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్ప సన్నిధానం ఆవరణలో గల అన్న ప్రసాద వితరణ కేంద్రంలో ఆదివారం కార్తీక మాసం పురస్కరించుకొని పలువురు దాతలు అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శెట్టి గిరి –సరస్వతి, అనంతుల శ్రీనివాస్ – రేణుక దంపతులు సహకరించినట్లు దేవాలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాస్ గురుస్వామి తెలిపారు. కార్యక్రమంలో పలువురు గురుస్వాములు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్నదానం

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్‌లో గల గాలి రమేష్ నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని 7వ రోజు ఆదివారం దాతలు చార్టడ్ అకౌంటెడ్ ఉమామహేశ్వర్‌చౌదరి–సాహితి దంపతులు ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు 400 మంది మాలధారులు, నిర్వాహకులు గాలి శ్రీనివాసునాయుడు, గడ్డం సూర్యారెడ్డి ఉన్నారు.



అన్నదానంలో పాల్గొన్న దాతలు, మాలధారులు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న దాతలు

పేదింటి బిడ్డల చదువుకు 'ఎన్ఆర్ఐల' చేయూత

హాలియా : తిరుమలగిరి (సాగర్) మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన యలకాని సైదయ్య ఇటీవల మృతి చెందాడు. కుటుంబ యజమాని మృతి చెందడం వల్ల పిల్లల చదువు కోసం ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న ఎన్ఆర్ఐలు నెమలి మాధవరెడ్డి, పసుపులేటి శ్రీనివాస్, రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి మృతి చెందిన సైదయ్య పిల్లలు యలకాని కావ్యశ్రీ, శ్రీలక్ష్మి, శివల విద్యాభ్యాసానికి స్కూల్ ఫీజు, బస్సు ఫీజు మొత్తం కలిపి రూ. 25వేలను విశ్వచైతన్య స్కూల్ యాజమాన్యానికి చెల్లించి ఆ రశీదును ఆదివారం బాధిత కుటుంబానికి అందజేసి అండగా నిలిచారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు నెమలి శ్రీధర్‌రెడ్డి, హాలియా వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి, గ్రామస్తులు పెద్ద మైసయ్య, చిన్న మైసయ్య, పాల్వాయి విష్ణు, మల్లయ్యచ వెంకటేశ్వర్లు, అంజి, కోటి తదితరులు ఉన్నారు.

డీసీసీ ఉపాధ్యక్షుడు యోగానందచారి పరామర్శ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివా స్‌గౌడ్ తల్లి, సీనియర్ నాయకురాలు చంద్రమ్మకు ఇటీవల కాలుకు ఆపరేషన్ జరగడంతో ఆమెను ఆదివారం డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి పరామర్శించారు. పరామర్శించిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, ఉపాధ్యక్షుడు పెసర సతీష్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, నర్సింగ కృష్ణమూర్తి, దొనకొండ వెంకన్న, కుంభం బన్నీగౌడ్, బౌరోజు ఉపేందర్, వల్లాల ఖాజ, మధు తదితరులు ఉన్నారు.

రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడికి సన్మానం



వెంకన్నను సన్మానిస్తున్న నాయకులు

అర్వపల్లి : డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడిగా నియమితులు కావడంతో ఆదివారం ఆయనను సూర్యాపేటలో తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్, మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. సన్మానించిన వారిలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు సామ అభిషేక్ రెడ్డి, జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఇందుర్తి వెంకట్ రెడ్డి, చిప్పలపెల్లి యాదగిరి తదితరులు ఉన్నారు.

వెంకన్నను కలిసిన కాంగ్రెస్ నాయకులు

రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్‌ను ఆదివారం సూర్యాపేటలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం కలిసారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం అయ్యేలా చూడాలని కోరారు.

రథయాత్రను జయప్రదం చేయాలి

అర్వపల్లి : అయోధ్య నుంచి మొదలైన హిందూ చైతన్య రథయాత్ర మంగళవారం జాజిరెడ్డిగూడెం మండలానికి చేరుతుందని బీజేపీ మండల సీనియర్ నాయకుడు వేముల సత్తయ్య తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అయోధ్య రాముడిని దర్శనం చేసుకోలేని వారి కోసం ఈ రథయాత్ర జరుగుతుందని చెప్పారు. శ్రీరాముడి ప్రతిమలను ఈ రథంలో ఉంచి ఊరేగింపుగా బయలుదేరిందని తెలిపారు. అర్వపల్లి, కొమ్మాల, కాసర్ల పహాడ్ తదితర గ్రామాలలో ఈ రథయాత్ర జరుగుతుందని తెలిపారు.

ఘనంగా కమ్మ సంఘం వనభోజనాలు



చిలుకూరు: పూర్ణకుంభంతో ర్యాలీగా వెళ్తున్న మహిళలు



ఉసిరిచెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

చిలుకూరు: మండల కేంద్రంలో ఆదివారం కాకతీయ కమ్మ సంఘం వనభోజనాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ముందుగా రామాలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి పూర్ణకుంభంతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక బొడ్రాయి వద్ద జలాభిషేకం నిర్వహించారు. గ్రామ శివారులో తోటలో ఉసిరి చెట్టు కింద మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో పలువురిని సత్కరించారు. కార్తీక వన భోజనాల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి కమ్మ సంఘం నాయకులు, చిలుకూరు, రామాపురం కమ్మ సంఘం నాయకులు పాల్గొన్నారు.